సాక్షి మంచిర్యాల

గురువారం । 6 । జూన్ । 2024



నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

ప్రాణహిత నది ఫెర్రీపాయింట్ వద్ద నీల్వాయి పోలీసులు నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నారు. రామగుండం సీపీ శ్రీనివాసులు తన కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. 8లో▸



శునకాల బెడద తప్పేనా?

జిల్లాలో కుక్కకాటు బాధితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. నిత్యం ఏదో ప్రాంతంలో ప్రజలను గాయపరుస్తున్నాయి. కుక్కల నియంత్రణకు శస్త్రచికిత్సలు చేస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
37.0 /28.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కనిష్ట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. నైరుతి దిశగా గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆరోగ్యకరమైన వాతావరణంతోనే మనుగడ



మొక్క నాటుతున్న కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆరోగ్యకమైన వాతావరణంలోనే జీవరాశి మనుగడ సాధ్యమని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్‌తో కలిసి మొక్కలు నాటారు. అందరితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్, జిల్లా స్త్రీ, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కె.చిన్నయ్య పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరాకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. బుధవారం జిల్లాకేంద్రలోని టౌన్–3 పరిధి రాజీవ్‌నగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో నూతనంగా 8ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు, మరమ్మతు పనులు పరిశీలించారు. ఎస్‌ఈ మాట్లాడుతూ విద్యుత్ సామర్థ్యం పెరగడంతోపాటు మంచిర్యాల టౌన్–3 ఏరియాలోని రాజీవ్‌నగర్, దొరగారిపల్లి, మజీద్‌వాడ, చున్నంబట్టివాడ, సాయికృష్ణ కాలనీ, తోళ్లవాగు, వినాయకనగర్, వసంత టాకీస్, సీతారామ కాలనీ, సాయికుంటరోడ్డు, తిరుమలగిరి కాలనీ, గాంధీనగర్, గోపాల్‌వాడ, సప్తగిరికాలనీ, హమాలీవాడ, సూర్యనగర్, తిలక్‌నగర్ తదితర ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ సౌకర్యం కలిగిస్తూ అంతరాయాలను సాధ్యమైనంత నిర్మూలించే చర్యలు చేపట్టామని తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న జిల్లా వైద్యాధికారి అనిత

నస్పూర్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని జిల్లా వైద్యాధికారి డాక్టర్ అనిత అన్నారు. బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా కృష్ణాకాలనీలోని ఉపకేంద్రం వద్ద పర్యావరణంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపకేంద్రం ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లాలోని 17 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 149 ఉప కేంద్రాల్లో నాలుగు వారాలపాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతామని పేర్కొన్నారు. అధికారులు అబ్దుల్ వాజిద్, సమత, వంశీకృష్ణ, లింగారెడ్డి, ప్రశాంత్, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

13 నుంచి సదరం వైద్య శిబిరాలు

పాతమంచిర్యాల: ఈ నెల 13 నుంచి జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో సదరం వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులు దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలు పొందడానికి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకుని నిర్ణీత తేదీల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కాలపరిమితి ముగిసిన పత్రాలను రెన్యూవల్ చేసుకోవాలని తెలిపారు. 13న శారీరక వికలాంగులు 50 మందికి, 19న మానసిక వికలాంగులు 50, 21న కంటి చూపు సమస్యలున్న వారు 30, 25న మూగచెవుడు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ నెల 7నుంచి స్లాట్ ఓపెన్ చేస్తారని, దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

నెన్నెల: అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి యాదయ్య సూచించారు. బుధవారం మండలంలోని కస్తూరిబా, నెన్నెల, జోగాపూర్, నందులపల్లి, దుబ్బపల్లి, గన్‌పూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతిపై పరిశీలన చేశారు. పాఠశాలలు పునఃప్రారంభంలోపే యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్లు, తాగునీరు, మరమ్మతు పనులు ఈ నెల 10లోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మహేశ్వర్‌రెడ్డి, మండల నోడల్ అధికారి ప్రకాష్‌రావు, సర్వశిక్ష అభియాన్ డీఈ, ఏఈ పాల్గొన్నారు.

బలపడిన హస్తం



శ్రీరాంపూర్: వంశీకృష్ణ గెలుపుపై ఆర్కే 6గనిపై ఐఎన్‌టీయూసీ శ్రేణుల సంబరాలు

- పదేళ్లుగా ఒడిదొడుకులు ఎదుర్కొన్న కాంగ్రెస్
- తాజా ఫలితాలతో బలమైన శక్తిగా 'హస్తం' పార్టీ
- గెలుస్తామని ఆశపడ్డ కమలనాథులకు నిరాశే
- మరింత బలహీన పడిన 'గులాబీ' పార్టీ

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కాంగ్రెస్ పార్టీ వరుస ఎన్నికల్లో సత్తా చాటుతూ బలమైన రాజకీయ శక్తిగా మారింది. 2014 ఎన్నికల నుంచి జిల్లాలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి, ఖానాపూర్(జన్నారం)తో సహా ఎక్కడా కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచిన దాఖలాలు లేవు. ఒక్కో నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థులు హ్యాట్రిక్ విజయం సాధించారు. ఆ సమయంలో 'హస్తం' పార్టీ నాయకులు గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నారు. కొందరు కీలక నేతలు కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి వలస వెళ్లారు. పదేళ్లుగా ఏ ఎన్నికలు జరిగినా భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్) సత్తా చాటింది. కార్యకర్తలు, నాయకులు, ప్రజాబలంతో ఎదిగింది. పెద్దపల్లి లోక్‌సభ స్థానాన్ని తమ కంచుకోటగా మార్చుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల నాటికి పరిస్థితులు ఒక్కసారిగా తలకిందులయ్యాయి. గత శాసనసభ ఎన్నికల ఫలితాలతో ఆ పార్టీ బలహీన పడుతూ వచ్చింది. తాజాగా పార్లమెంటు ఎన్నికల ఫలితాల్లో మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అదే సమయంలో బీజేపీ మాత్రం తన ఓటు బ్యాంకు పెంచుకుంది.

ఎమ్మెల్యేలే సగం బలం

లోక్‌సభ ఎన్నికల్లో స్థానిక ఎమ్మెల్యేలే ఎంపీ అభ్యర్థి గెలిచేందుకు సగం బలంగా మారారు. పెద్దపల్లి, ధర్మపురి, రామగుండం, మంథని, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గెలవడంలో కీలకం అయ్యారు. ప్రచార సమయంలో అభ్యర్థితో సభలు, సమావేశాలు నిర్వహిస్తూ తమ వాణిని ప్రజల్లోకి తీసుకెళ్లారు. జిల్లా నుంచే చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో గడ్డం సోదరులు వివేక్, వినోద్ ప్రజాప్రతినిధులుగా ఉండడం మరింత కలిసొచ్చింది. పార్టీలో ఎంపీ టికెట్ ఖరారు సమయంలో 'కాకా' ఫ్యామిలీకే రాజకీయంగా ప్రాధాన్యత ఇస్తున్నారని అంతర్గతంగా అసంతృప్తి కనిపించింది. ఢిల్లీ నుంచి అండ, గాంధీభవన్ నుంచి మద్దతు ఉండడంతో వంశీకి ఎవరూ ఎదురు చెప్పలేకపోయారు. మరోవైపు పార్టీలో మాదిగలకు టికెట్ ఇవ్వాలనే డిమాండ్ వినిపించింది. ఆ అసంతృప్తి మాత్రం ఓట్లలో కనిపించలేదు. పోలింగ్ సమయంలో ఆ సామాజిక వర్గం ఓట్లు బీఆర్‌ఎస్, బీజేపీ వైపు మళ్లుతాయా..? అనే టెన్షన్ కాంగ్రెస్ నేతల్లో ఉంది. భారీ మెజార్టీతోనే అభ్యర్థి బయటపడడం హస్తం పార్టీకి ప్రజాబలం ఉందని నిరూపితమైంది.

బీజేపీ ఆశలు గల్లంతు

కేంద్రంలోని ప్రధాని మోదీ చరిష్మా పెద్దపల్లి పరిధిలో ప్రభావితం చేయలేదు. బీజేపీ ప్రభుత్వ పథకాలు, విధానాలు, రామమందిరం, హిందుత్వం, యువత, పట్టణ ఓటర్లతో గెలుస్తామని అనుకున్న కమలనాథుల ఆశలు గల్లంతయ్యాయి. పోలింగ్, ఎగ్జిట్ పోల్స్‌లోనూ బీజేపీకి మద్దతు ఉందనే అంచనాలతో ఆ పార్టీ నాయకులు నమ్మకం పెంచుకున్నారు. ఫలితాల్లో డీలా పడడంతో నారాజ్ అయ్యారు. సర్వే సంస్థలు, రాష్ట్రంలో బీజేపీ హవా కొనసాగిందని, ప్రచారం చేయడంతో పెద్దపల్లి పరిధిలోనూ విజయం సాధిస్తామనే ధీమాతో ఉన్నారు. కానీ గ్రామీణ, మహిళా ఓటర్లు, కాంగ్రెస్ ఓటు బ్యాంకు పదిలంగా ఉండడంతో పార్టీ విజయం ఖాయమైంది. ఏడు నియోజకవర్గాల్లో అత్యధికంగా మంథని పరిధిలో 87వేలకు పైగా ఓట్లు రాగా, బెల్లంపల్లి నుంచి 57వేలు వచ్చాయి. ప్రతీ నియోజకవర్గంలోనూ 55వేలకు పైగానే ఓట్లు రావడంతో భారీ మెజార్టీ కాంగ్రెస్ పార్టీ సొంతమైంది.

పెద్దపల్లి లోక్‌సభ పరిధి అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా ఓట్ల వివరాలు

నియోజకవర్గం	గడ్డం వంశీకృష్ణ	గోమాసే శ్రీనివాస్	కొప్పుల ఈశ్వర్
చెన్నూర్	59,489	33,775	26,743
బెల్లంపల్లి	57,157	32,577	22,453
మంచిర్యాల	79,101	59,716	21,614
ధర్మపురి	57,633	66,221	32,075
రామగుండం	55,472	45,341	27,578
మంథని	87,237	32,711	34,156
పెద్దపల్లి	74,091	68,766	27,272
పోస్టల్ బ్యాలెట్ ఓట్లు	5,407	5,116	1465
మొత్తం	4,75,587	3,44,223	1,93,356
ఇతరులు(39మంది అభ్యర్థుల ఓట్లు)		76,418	
నోటా	5,711	తిరస్కరించినవి	725

మొత్తం పోలైన ఓట్లు : 10,96,020

ప్రజల రుణం తీర్చుకుంటాం

- చెన్నూర్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ



మాట్లాడుతున్న ఎంపీ వంశీకృష్ణ, పక్కన వివేక్

చెన్నూర్/భీమారం: చెన్నూర్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. పెద్దపల్లి ఎంపీగా గెలుపొందిన తర్వాత మొదటిసారిగా చెన్నూర్‌కు వచ్చిన వంశీకృష్ణ, చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌లకు కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చారు. అనంతరం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వంశీకృష్ణ మాట్లాడారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచిన కార్యకర్తలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే వివేక్ మాట్లాడుతూ నరేంద్రమోదీ అహంకారానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పారని అన్నారు. నిరుపేదలకు గృహాలక్ష్మి పథకం ద్వారా ఇళ్ల నిర్మాణాలకు పెద్దపీట వేస్తామని తెలిపారు. భీమారంలో పార్టీ నాయకులు ఎంపీ వంశీకృష్ణకు ఘనంగా స్వాగతం పలికారు. వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజలు తనపై నమ్మకంతో గెలిపించారని, వారి ఆశలు వమ్ము చేయకుండా అభివృద్ధి పనులు చేపడుతానని తెలి పారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా జెడ్పీ వైస్ చై ర్మన్ మూల రాజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రాజమల్లగౌడ్, హిమవంతరెడ్డి, సూర్యనారాయణ, చల్లా రాంరెడ్డి, సుశీల్‌కుమార్, భీమారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, జిల్లా నాయకులు పాడే టి రవి, అరుణ్‌కుమార్, బుక్యా లక్ష్మణ్ పాల్గొన్నారు.

'ప్రజా సమస్యలపై పోరాటం'



మాట్లాడుతున్న గోమాసే శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తనకు ఓట్లు వేసి రెండో స్థానం అందించినందుకు కృతజ్ఞతలని, ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తానని బీజేపీ నాయకుడు గోమాసే శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దపల్లి నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి మంచిర్యాలలోనే ఉండి 25 రోజుల పాటు ప్రతీ గ్రామానికి వెళ్తానని అన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకుని, కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కారం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసిపేట శివాజీ, తోట మల్లికార్జున్, లింగన్నపేట విజయ్, మంత్రి రామన్న, చెన్నూరు సమ్మయ్య, పూస్కూరి రాయమల్లు, కల్వల శరత్, దుర్గం ఎల్లయ్య, దూట రాజ్‌కుమార్, కమల పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలకు అభినందనలు

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్‌కు రెండోస్థానం వచ్చేందుకు కృషి చేసిన ప్రతీ కార్యకర్తకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇకపై ఏ ఎన్నిక జరిగినా మండల అధ్యక్షుడు, మండల కమిటీ సభ్యులు, శక్తి కేంద్రం ఇంచార్జి, బూత్ కమిటీ సభ్యులు మరింతగా పనిచేయాలని సూచించారు.

బయోమెట్రిక్ పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాహుల్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 9న జిల్లాలో జరిగే గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలో బయోమెట్రిక్ పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో రామగుండం ఏసీపీ సురేంద్ర, ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ వి.చక్రపాణితో కలిసి గ్రూప్–1 పరీక్ష సన్నద్ధతలో భాగంగా బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రూప్–1 పరీక్ష నిర్వహణకు 27 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 9,384 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నారని తెలిపారు. బయోమెట్రిక్ నిర్వహణకు అందరూ సుశిక్షితులు కావాలని, సహకారంగా పోలీసు బయోమెట్రిక్ బృంద సభ్యులు ఉంటారని తెలిపారు. 71 మంది బయోమెట్రిక్ ఇన్విజిలేటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించామని అన్నారు. పోలీస్ బయోమెట్రిక్ అధికారి ప్రమోద్, సహాయ అధికారి ముజాహిద్, బయోమెట్రిక్ సమన్వయకర్త జాడి రమేష్ ఇన్విజిలేటర్లకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు.

ప్రతీ అంశాన్ని ఏకాగ్రతతో నేర్చుకోవాలి

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్
- గ్రూప్–1 పరీక్ష నిర్వహణపై సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణలో భాగంగా అందిస్తున్న శిక్షణలో ప్రతీ అంశాన్ని ఏకాగ్రతతో నేర్చుకుని పొరపాట్లు లేకుండా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో ముఖ్య పర్యవేక్షకులు, పరిశీలకుల శిక్షణ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ చక్రపాణితో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 9న ఉదయం స్ట్రాంగ్‌రూమ్ నుంచి పరీక్ష కేంద్రాలకు కేటాయించిన రూట్ల ప్రకారంగా రూట్ అధికారులతో ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్, ఇతర సామగ్రి పోలీసు బందోబస్తు మధ్య తరలిస్తామని తెలిపారు. దివ్యాంగులకు నిబంధనల మేరకు 50 నిమిషాలు అదనపు సమయం ఇస్తామని తెలిపారు.

ప్రత్యేక హెల్ప్‌లైన్ ఏర్పాటు

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఈ నెల 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తామని కలెక్టర్ సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని, ఆ తర్వాత అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అభ్యర్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, సందేహాల నివృత్తి, సహాయం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ 08736-250500 ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

సీఎంఆర్ త్వరగా పూర్తి చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: రైస్‌మిల్లర్లు సీఎంఆర్ లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఉమారాణితో కలిసి సంబంధిత అధికారులతో సీఎంఆర్ నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిర్దేశిత ధాన్యం సేకరణ లక్ష్యం పూర్తి చేసిన 281 కొనుగోలు కేంద్రాలు మూసి వేశామని, ఐదు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని అన్నారు. లక్ష్యసాధనలో నిర్లక్ష్యం, అలసత్వం, వహించిన రైస్‌మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. పెద్దపల్లికి తరలించిన ధాన్యం సంబంధిత నగదును ఆయా రైతుల ఖాతాల్లో త్వరలో జమ చేస్తామని తెలిపారు.

భౌతిక రసాయన, గణితంకు ప్రాధాన్యత ఇవ్వాలి



ఎన్నికైన ఎఫ్‌పీఎస్‌టీ సభ్యులు

మంచిర్యాలఅర్బన్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎంసెట్, ఐఐటీ, జేఈఈలకు ఎంపిక కావాలంటే భౌతిక రసాయన, గణితానికి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఫిజికల్ సైన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.శ్రీమూర్తి అన్నారు. బుధవారం జిల్లా సైన్స్ కేంద్రంలో ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్ సమావేశం నిర్వహించారు. పలు సమస్యలపై చర్చించి తీర్మానాలు చేశారు. అనంతరం ఫోరమ్ ఆఫ్ ఫిజికల్ సైన్స్ టీచర్(ఎఫ్‌పీఎస్‌టీ) జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కే.శ్రీమూర్తి, ప్రధాన కార్యదర్శిగా కే.రాజన్న, కార్యదర్శులుగా రాజేశం, సుధ, శ్రీధర్, సరిత, కిషన్, ఎం.శ్రీధర్, జిల్లా కోశాధికారిగా సదానందం ఎన్నికయ్యారు. సమావేశంలో వివిధ సంఘాలకు చెందిన ఉపాధ్యాయులు వేణుగోపాల్, రవి, శ్రీనివాస్, జాకీర్‌హుస్సెన్, రవీందర్, రవికుమార్, విద్యాసాగర్, డీఎస్‌వో మధుబాబు పాల్గొన్నారు.

కమిషనర్‌గా వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్‌గా మందమర్రి మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గత 31న రెగ్యులర్ కమిషనర్ గోపు మల్లారెడ్డి ఉద్యోగ విరమణ చేయగా మున్సిపల్ డీఈ మసూద్ అలీని ఇంచార్జి కమిషనర్‌గా నియమించారు. తాజా గా వెంకటేశ్వర్లుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రత్యేక నిధులతో విద్యాభివృద్ధి

- విశ్రాంత డిగ్రీ కళాశాల అధ్యాపకుడు, విద్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.నారాయణ



కే.నారాయణ

మంచిర్యాలఅర్బన్: 'విద్యను విలువల్లో భాగంగా చూడాలే తప్ప.. ప్రయోజనాల్లో చూడకూడదు. సమాజం ఎంత ఒత్తిడి చేస్తే ప్రభుత్వాలు విద్యపై అంత ఆలోచిస్తాయి. వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక నిధుల కేటాయింపుతోనే విద్యారంగం అభివృద్ధి చెందుతుంది..' అని డిగ్రీ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు, విద్య పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.నారాయణ అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడుస్తున్న నేపథ్యంలో విద్యారంగం తీరుతెన్నులపై 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

రాష్ట్రం ఏర్పడి పదేళ్లు గడుస్తోంది.. విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు, మార్పులపై వివరిస్తారా..?


నారాయణ: గత పదేళ్ల కాలంలో విద్యారంగం చాలా నిర్లక్ష్యానికి గురైంది. 2014 కంటే ముందు తెలంగాణ విద్యాప్రమాణాలు 12 శాతం ఉంటే తర్వాత 18శాతానికి పడిపోయాయి. ఉమ్మడి రాష్ట్రంలో విద్యారంగానికి ఖర్చు చేసిన దానికంటే గత ప్రభుత్వం దిగిపోయే నాటికి సగానికి కుదించారు. ఉమ్మడి ప్రభుత్వంలో రాయలసీమ, ఆంధ్ర ప్రాంతానికి నిధులు కేటాయించి నిర్లక్ష్యం చేసినందునే తెలంగాణ ఉద్యమం మొదలైన విషయం తెలియంది కాదు. దేశంలో తెలంగాణ పిల్లల అభ్యసన సామర్థ్యాలు 2014కు ముందు 13శాతం నుంచి ప్రస్తుతం 20శాతానికి, పాఠశాల విద్య నిర్వహణలో 18శాతం పడిపోయింది. కేజీ టు పీజీ విద్య నినాదమే. ఉమ్మడి రాష్ట్రంలో 12 శాతం నిధులు కేటాయిస్తే తెలంగాణ ప్రభుత్వం 11శాతానికి, చివరికి 6.8శాతం బడ్జెట్‌లో కేటాయించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు అరకొర వసతుల మధ్య అద్దె భవనాల్లో కాలం వెళ్లదీయాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలో సర్కారు విద్యపై వివరించండి..

నారాయణ: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వెనకబడిన ప్రాంతం. విద్యారంగానికి ప్రత్యేక నిధులు కేటాయించాల్సిన అవసరం ఉన్నా పాలకులు పట్టించుకోలేదు. చాలా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కీలకమైన ఎంఈవో పోస్టుల్లో ఒక్కరే రెగ్యులర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒక్క మంచిర్యాల జిల్లాలోనే 490పైన ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలున్నాయి. భర్తీ చేయకపోవడంతో చదువులు ఎలా ముందుకు సాగుతాయి. వసతుల కల్పనలో కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఇటీవల ఉమ్మడి జిల్లా పర్యటనలో ఆడపిల్లలను సర్కారు బడికి పంపడం లేదని తేలింది. ఎందుకుని ఆరా తీస్తే ఆడపిల్లలు, మగపిల్లలకు మరుగుదొడ్లు(వరుసకట్టి, చిన్న గోడ అడ్డుగా) పక్కపక్కనే ఉండడంతో తల్లిదండ్రులు విముఖతకు కారణమని తెలిసింది. చిన్న చిన్న వసతుల కల్పనలో కూడా ప్రభుత్వం పట్టించకోకపోవడం బాధగా ఉంది. ఉత్తమమైన బోధకులున్నా ప్రభుత్వాల తప్పిదాల వల్ల విద్యారంగం కుంటుపడుతోంది.

ప్రైవేట్, కార్పొరేట్, ప్రభుత్వ విద్యారంగంలో వ్యత్యాసాలేమిటి..?

నారాయణ: ప్రైవేట్, కార్పొరేట్ విద్య బలపడడానికి ప్రభుత్వమే కారణం. సర్కారు పాఠశాలలు, కళాశాలల్లో సకల వసతులు కల్పన ఉన్నాయని చెబుతున్నా క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులున్నాయి. సర్కారు పాఠశాలల్లో పోటీ పరీక్షలు రాసిన ఉత్తమమైన బోధకులున్నా కనీస వసతులు లేకపోవడం.. సబ్జెక్టు టీచర్ల కొరత కారణంగా విద్యార్థులు ఎక్కడ నష్టపోతారనే ఉద్దేశంతో తల్లిదండ్రులు ప్రైవేట్ విద్యవైపు ఆకర్షితులవుతున్నారు. విద్య అనేది ప్రభుత్వ అదీనంలో ఉండాలి. అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా ప్రభుత్వమే నడిపిస్తోంది. కొన్ని దేశాల్లో ప్రైవేట్ విద్యాసంస్థలను ఏర్పాటు చేయాలంటే భయపడే స్థాయి(వసతుల కల్పన, బోధన)లో ప్రభుత్వాలు విద్యనందిస్తుందంటే అర్థం చేసుకోవచ్చు.



కొత్త ప్రభుత్వానికి మీరిచ్చే సలహాలు, సూచనలు

నారాయణ: ప్రభుత్వం విద్యకు సరైన బడ్జెట్ కేటాయింపులు చేయాలి. మూసివేసిన ప్రతీ పాఠశాలను తెరిపించాలి. రద్దయిన పోస్టులు పునరుద్ధరించాలి. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఉపాధ్యాయుల నియామకం చేపట్టాలి. ప్రతీ క్లాస్‌కు ఓ తరగతి గది, ఓ ఉపాధ్యాయుడు ఉండాలి. ఖాళీగా ఉన్న టీచర్, హెచ్‌ఎం, ఎంఈవో పోస్టులు భర్తీ చేయాలి. ఆడ, మగపిల్లలకు దూరంగా వేర్వేరుగా నిరంతర నీటి వసతితో కూడిన టాయిలెట్లు, కనీస వసతులపై దృష్టి సారించాలి. వెనుకబడిన ప్రాంతమైన ఉమ్మడి జిల్లా ఆదిలాబాద్‌కు ప్రత్యేక బడ్జెట్ కేటాయించి శ్రద్ధ చూపాలి.

బడుల బలోపేతానికి ఏం చేయాలి ?

నారాయణ: వెనకబడిన ప్రాంతాల్లో విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. చాలాచోట్ల విద్యార్థులుంటే బోధన చేసేవారు లేరు. కనీస సౌకర్యాలు తాగునీరు, మరుగుదొడ్లు లేని పరిస్థితి. విద్యార్థుల సంఖ్యతో సంబంధం లేకుండా ప్రతీ ఆవాస ప్రాంతా(తండా, గ్రామం)ల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలి. మూడు, నాలుగు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్లాలంటే కష్టమే. విద్యకు ప్రాధాన్యత ఇస్తేనే దేశం అభివృద్ధి సాధ్యం. కేజీబీవీ, రెసిడెన్షియల్‌లో రెగ్యులర్ టీచర్లను నియమించాలి. బడ్జెట్ కేటాయింపులు లేకుండా పాఠశాలలు, వసతిగృహాలు అద్దె భవనంలో నడపడం, ఔట్‌సోర్సింగ్‌తో కనీస వేతనాలు చెల్లించకపోవడం వంటి సమస్యలతో విద్యారంగం ఎట్లా ముందుకు పోతుంది..? ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీ, కనీస వసతులతోనే బలోపేతం అవుతాయి.

క్లుప్తంగా

బావిలో దూకి వృద్ధురాలి ఆత్మహత్య

లింగాపూర్: బావిలో దూకి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పిక్లాతండాలో చోటు చేసుకుంది. ఎస్సై కొట్టే ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన బోడా దేవులిబాయి (59) కొంతకాలంగా మద్యం సేవించి ఇరుగు పొరుగు వారితో గొడవ పడుతుండేది. ఆమె కుమారుడు బోడా శంకర్ మందలించడంతో మనస్తాపానికి గురైంది. బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడు బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): అనారోగ్య సమస్యలతో వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన హాజీపూర్ మండలం పెద్దంపేటలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బెంబడి బక్కయ్య(70) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య పోసు, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చిరుతపులి దాడిలో చుక్కలదుప్పి హతం



దుప్పి కళేబరం

రామకృష్ణాపూర్: బొక్కలగుట్ట గాంధారిఖిల్లాలో చిరుతపులి దాడిలో చుక్కల దుప్పి హతమైన సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఖిల్లా దిగువ భాగానికి వెళ్లిన ఉపాధిహామీ కూలీలు దుప్పి కళేబరాన్ని గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించగా వేసవి దృష్ట్యా దాహం కోసం వచ్చిన దుప్పిపై చిరుతపులి దాడి చేయడంతో మృతి చెందినట్లు నిర్ధారించారు.

భయాందోళనలో గ్రామస్తులు

చిరుతపులి సంచారం, దుప్పి మృతి ఘటన గాంధారి ఖిల్లా పరిసర ప్రాంతాల్లో అలజడి రేపుతోంది. కొన్ని నెలల క్రితం చిరుతపులి సంచరిస్తున్న విషయం బయటకు రావటం ఇప్పుడు దుప్పి కళేబరం వెలుగులోకి రావడంతో సహజంగానే ఆందోళన మొదలైంది. గాంధారి ఖిల్లా పరిసర గ్రామాలైన బొక్కలగుట్ట, పులిమడుగు ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. కాగా ఈ దాడి ఘటన మంచిర్యాల జిల్లాలో సంచలనం రేపింది.

శునకాల బెడద తప్పేనా..?



జిల్లా కేంద్రంలోని రెడ్డికాలనీలో గుంపులుగా వీధి కుక్కలు

- అనిమల్ కేర్ సెంటర్‌లో శస్త్ర చికిత్సలు ప్రారంభం
- రోజురోజుకూ పెరుగుతున్న వీధి కుక్కల బాధితులు

మంచిర్యాలటౌన్: జిల్లాలో కుక్కకాటుకు గురవుతున్న బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. కుక్కలను నియంత్రించేందుకు మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలోని ఆండాళమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ఎనిమల్ కేర్ సెంటర్‌ను ఇటీవల మున్సిపల్ అధికారులు ప్రారంభించి శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నారు. ఒకవైపు వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేస్తుండగానే ఏదో ఒక ప్రాంతంలో ప్రజలను గాయపరుస్తూనే ఉన్నాయి. ప్రస్తుతం మంచిర్యాల మున్సిపాలిటీలోనే కుక్కలను పట్టుకునే కార్యక్రమాన్ని చేపడుతున్నా ఈ ఎనిమల్ కేర్ సెంటర్‌లో జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లోని వీధి కుక్కలను తీసుకువచ్చి, సంతానోత్పత్తి కలగకుండా శస్త్ర చికిత్సలు చేసి, ఎక్కడి నుంచి తీసుకువచ్చారో అదే ప్రాంతంలో తిరిగి వాటిని వదలాల్సి ఉంది. అధికారిక లెక్కల ప్రకారం ప్రతీనెల జిల్లాలో సగటున 90 మంది కుక్కకాటుకు గురవుతున్నట్లు తెలుస్తోంది. అయితే కుక్కకాటుకు గురయ్యే వారి సంఖ్య దీనికి మూడు రెట్లకు పైగానే ఉంటుందని తెలుస్తోంది. కుక్క కరిచిన వారు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తే రేబీస్ వ్యాక్సిన్‌ను వేసి గాయాలకు చికిత్స చేసి పంపిస్తున్నారు.

వీధుల్లో గుంపులు గుంపులుగా..

ఇటీవల కాలంలో వీధుల్లో రోడ్లపై శునకాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ చిన్నారులతో పాటు, పెద్దలపైనా దాడికి దిగుతున్నాయి. వీధి కుక్కలను నియంత్రించక పోవడంతో ప్రజలు గాయాల పాలవుతున్నారు. వీధి కుక్కలపై ఎలాంటి చర్యలను తీసుకున్నా జంతు ప్రేమికులు ఏం చేస్తారోననే భయం, చట్ట ప్రకారం చర్యలు ఉంటాయనే ఉద్దేశ్యంతో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రోజురోజుకూ పెరుగుతున్న శునకాలతో వీధుల్లో నుంచి నడుస్తూ వెళ్లేందుకు ప్రజలు భయపడిపోతున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోనే ఓ పిచ్చికుక్క చేసిన దాడిలో దాదాపుగా 40 మందికి పైగా ఒకేసారి గాయపడ్డారు. ఒకే కుక్క పదుల సంఖ్యలో ప్రజలను కరవడంతో పాటు, పశువులు, ఇతర వీధి కుక్కలను కరిచింది. స్థానికులు దానిని పట్టుకుని చంపినా ఇతర వీధి కుక్కలను కరవడంతో మరింత ప్రమాదం పొంచి ఉంది. చున్నంబట్టివాడలో మార్బుల్ పనులు చేసుకునే వ్యక్తి ఎడమచేతి బొటనవేలిని కుక్క కొరికి పట్టుకుపోవడంతో అతన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుక్క కాటుకు గురైన వారి సంఖ్య పెరుగుతుండడంతో, వీధుల్లోకి వెళ్లేందుకు ప్రజలు జంకుతున్నారు. ఎప్పటికప్పుడు కుక్కలకు రేబీస్ టీకాలను వేయించక పోవడం వల్లనే కుక్కలు ప్రజల మీదకు దాడి చేసి కరుస్తున్నాయి. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లోని శునకాల సంతతిని నియంత్రించేందుకు ప్రత్యేకంగా అనిమల్ కేర్ సెంటర్‌ను మంచిర్యాల మున్సిపాలిటీలోని ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డు సమీపంలో పది నెలల క్రితం రూ.35 లక్షలతో నిర్మించారు. ఇందులో శునకాల సంతతిని నియంత్రించే ఆపరేషన్లు చేసి అవి కోలుకునే వరకు వాటిని ఉంచేందుకు ప్రత్యేకంగా కేజెసర్(పంచరం) వంజరం జాలీలతో కూడిన షెడ్‌ను నిర్మించారు. అయినా వీధుల్లో శునకాలు గుంపులుగా తిరుగుతుండడం భయాందోళన కలిగిస్తోంది.



కుక్కకు కు.ని ఆపరేషన్ చేస్తున్న వైద్యుడు

జిల్లాలో ఆరేళ్లుగా కుక్కకాటుకు గురైనవారు

సంవత్సరం	బాధితులు
2019	3,048
2020	2,460
2021	2,168
2022	1,685
2023	2,,277
2024	450(జూన్ 2 వరకు)

ఇటీవలే ప్రారంభించాం



మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన అనిమల్ కేర్ సెంటర్‌ను ఇటీవలే ప్రారంభించాం. 80 కుక్కలకు శస్త్ర చికిత్స చేయించాం. వీధి కుక్కల బెడద ఇటీవల ఎక్కువైంది. అందుకే అనిమల్ కేర్ సెంటర్‌ను ప్రారంభించాం.


– మారుతి ప్రసాద్, మంచిర్యాల మున్సిపల్ కమిషనర్

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత



నిందితుడు, విత్తనాలతో సీపీ, పోలీసులు

వేమనపల్లి: ప్రాణహిత నది ఫెర్రీపాయింట్ వద్ద బుధవారం ఉదయం నీల్వాయి ఎస్సై శ్యాంపటేల్, మండల వ్యవసాయాధికారి వీరన్న ఆధ్వర్యంలో 2.5 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుకున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాసులు తెలిపారు. సీపీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ప్రాణహిత నది అవతలి వైపు ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సిరోంచ తాలూకా కోటపల్లికి చెందిన కోల సాయికిరణ్ నకిలీ విత్తనాలను ఎడ్లబండిలో ప్రాణహిత నది దాటించి వేమనపల్లి వైపునకు వస్తుండగా పట్టుకున్నారు. ఎడ్లబండిలోని ఏడు సంచుల్లో 2 క్వింటాళ్ల 5 కిలోల నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. పోలీసులను గమనించి కోటపల్లికి చెందిన కోల రమేశ్ అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు. ఎడ్లబండితో సహా నిందితుడు కోల సాయికిరణ్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. నకిలీ విత్తనాలను మహారాష్ట్రలోని ఆస్తికి చెందిన సుమిత్ , తాళ్లటేకడకు చెందిన జంగ సంపత్‌ల వద్ద నుంచి తీసుకొచ్చినట్లు నిందితుడు వెల్లడించాడు. మంచిర్యాల జిల్లాలో విక్రయించేందుకు ఎడ్లబండిద్వారా తరలించినట్లు తెలిపారు. సాయికిరణ్ ఎడ్లబండితో దొరికిపోగా మిగతా ముగ్గురు పరారీలో ఉన్నారు. నకిలీ పత్తి విత్తనాలను, నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఎస్సై శ్యాంపటేల్, కానిస్టేబుళ్లు రాజేందర్, రాజశేఖర్‌లను సీపీ అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో మంచిర్యాల డీసీపీ అశోక్ కుమార్, అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై శ్యాంపటేల్, తదితరులు పాల్గొన్నారు.



రేషన్ దుకాణం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు


సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: 'తరలిపోతున్న రేషన్ బియ్యం' శీర్షికన బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా సివిల్ సప్లై అధికారులు స్పందించారు. పట్టణ పరిధిలోని రేషన్ షాపు 11 నుండి ఈ నెల 4న పీడీఎస్ బియ్యం ఇతర ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తున్న విషయాన్ని సాక్షి వెలుగులోకి తెచ్చింది. స్పందించిన సివిల్ సప్లయ్ అధికారులు సదరు రేషన్ దుకాణాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలు మధుసూధన్‌రావు, వరదరాజులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గత నెల 24న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన హాజీపూర్ మండలం గుడిపేట గ్రామానికి చెందిన కారుకూరి రాజమణి (53) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై గోపతి సురేశ్ తెలిపారు. గుడిపేటకు చెందిన రాజమణి కొంతకాలంగా అనారోగ్యంతో పాటు ఇంటి సమస్యలతో బాధపడుతోంది. దీంతో మనస్తాపం చెంది గుర్తు తెలియని పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి, అక్కడి నుంచి కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందింది. మృతురాలికి భర్త సత్తయ్య, కుమారులు అంజనేప్రసాద్, ప్రశాంత్ ఉన్నారు. కుమారుడు అంజనేయప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు కృషిచేయాలి



మొక్క నాటుతున్న జడ్జి రవి

చెన్నూర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చెన్నూర్ సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు అంతరించిపోతే మానవ మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వర్లు, ఏజీపీ రాంభావ్, ఫారెస్ట్ అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అడవుల పెంపకం కోసం పాటుపడాలి

భీమారం: అడవుల పెంపకం కోసం అందరూ పాటుపడాలని జిల్లా సంక్షేమాధికారి చిన్నయ్య కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రాధా రాథోడ్‌తో కలిసి మొక్కలు నాటారు.

నీట్‌లో విద్యార్థుల ప్రతిభ



సుహిత వర్మ



శ్రీజ

దండేపల్లి: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన నీట్ పరీక్షల్లో దండేపల్లి మండలానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబర్చారు. మండలంలోని గూడెం గ్రామానికి చెందిన కానగంటి మల్లేశ్ కుమార్తె సుహితవర్మ 511 మార్కులు, నర్సాపూర్ గ్రామానికి చెందిన పూరెల్ల నాగన్న కుమార్తె శ్రీజ 503 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థినులను పలువురు అభినందించారు.

బెల్లంపల్లి సీఓఈ విద్యార్థుల ప్రభంజనం



జుమ్మిడి ప్రణయ్



గోమాస అఖిల్



యెరెకర్ నికిత్

బెల్లంపల్లి: నీట్ ఫలితాల్లో బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) కళాశాల విద్యార్థులు మెరిశారు. 26 మంది విద్యార్థులు హాజరు కాగా 11 మంది అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ ఐనాల సైదులు ప్రకటించారు. జుమ్మడి ప్రణయ్ 404 మార్కులతో కళాశాల టాపర్‌గా నిలిచాడు. గోమాస అఖిల్ 375, మాల్కర్ శివకృష్ణ 333, యెరెకర్ నిఖిత్ 293 మార్కులు సాధించారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సీఓఈ సూపరింటెండెంట్ అవధూత రాజశేఖర్, సిబ్బంది తేజశ్వీ, సమెందర్, తదితరులు పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రికి గ్రీన్ చాంపియన్ అవార్డు



అవార్డు అందుకుంటున్న ఏసీఎంవో

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి ఏరియా ఆస్పత్రికి గ్రీన్ ఛాంపియన్ అవార్డు లభించింది. ఆస్పత్రి ఆవరణలో పచ్చదనం, పారిశుధ్యం మెరుగ్గా నిర్వహిస్తుండటంతో తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఈ అవార్డును ప్రకటించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లోని కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆస్పత్రి ఏసీఎంవో డాక్టర్ ఉషారాణి ఈ అవార్డును అందుకున్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



ఆర్కే 5 గనిపై మొక్క నాటుతున్న జీఎం సంజీవరెడ్డి

- జీఎం సంజీవరెడ్డి
- గనులపై పర్యావరణ దినోత్సవం

శ్రీరాంపూర్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి అన్నారు. బుధవారం సింగరేణి ఆధ్వర్యంలో పలు గనులు, డిపార్టుమెంట్లపై పర్యావరణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం కార్యాలయం, ఆర్కే 8 డిస్పెన్సరీ, ఆర్కే 5 గనిపై జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్న జీఎం ఉద్యోగులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకల ప్రాణుల మనుగడ పర్యావరణం మీద ఆధారపడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం పురుషోత్తంరెడ్డి, ఏజెంట్ గోపాల్ సింగ్, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎంలు అరవిందరావు, చిరంజీవి, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్, డిప్యూటీ సీఎంవో రమేశ్‌బాబు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్, ఆర్కే 5గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ బాజీసైదా, ఆర్కే 6 గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి శివయ్య, సంక్షేమాధికారి రణదీప్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్కే 6 గనిపై..

గని మేనేజర్ తిరుపతి ఆధ్వర్యంలో ఉద్యోగులతో పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచించారు. ఈ సందర్భంగా పర్యావరణం పై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గని రక్షణాధికారి కాదాసు శ్రీనివాస్, వెంటిలేషన్ అధికారి రాంనర్సయ్య, డిప్యూటీ మేనేజర్ మర్రి కొమురయ్య, గుర్తింపు సంఘం నాయకులు ముస్కె సమ్మయ్య, తోట మహేష్, చిలక రాంచందర్, నగేష్, సురేష్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో..

ప్రాజెక్టు అధికారి టీ.శ్రీనివాస్ పర్యావరణ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో గని మేనేజర్ శ్రీనివాస్, పర్యావరణ అధికారి జలాలుద్దీన్, అధికారుల సంఘం ప్రతినిధి కరీముద్దీన్, పిట్ సెక్రెటరీ మోతే లచ్చన్న,సంక్షేమాధికారి శంకర్ పాల్గొన్నారు.

పర్యావరణ వేడుకల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో బుధవారం నిర్వహించిన పర్యావరణ వేడుకలను ఐఎన్‌టీయూసీ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఆధ్వర్యంలో కార్మికులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజీఎం వైఖరికి నిరసనగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా వారి పట్ల వివక్షత చూపుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. సీహెచ్‌పీలో సమస్యలను, సేఫ్టీని కూడా పట్టించుకోవడం లేదన్నారు. కార్మికులు తమ సమస్యల కొరకు అతని వద్దకు వెళ్తే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్ని సార్లు చెప్పినా వైఖరి మార్చుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యాం, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, నాయకులు బుస్స రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

అద్దె వాహన యజమానుల సమ్మె



సమ్మెలో పాల్గొన్న వాహన యజమానులు

శ్రీరాంపూర్: సింగరేణిలో అద్దె ప్రాతిపదికన కార్లు, జీపులు, వ్యాన్లు నడుపుతున్న ఓసీపీ నిర్వాసితులు బుధవారం నుంచి కంపెనీ వ్యాప్తంగా అన్ని ఏరియాల్లో వాహనాలు నిలిపివేసి సమ్మెలో పాల్గొన్నారు. దీంతో శ్రీరాంపూర్‌లో సుమారు 80 వాహనాలు నిలిచిపోయాయి. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద వాహన యాజమానులు అప్పాల కుమార్, మోహన్, మేకల శేఖర్ తదితరులు సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎంపీఎఫ్ డబ్బులను చెల్లించే విషయంలో తమకు జరుగుతున్న నష్టానికి నిరసనగా ఈ సమ్మెలో పాల్గొంటున్నామన్నారు. కంపెనీ నిబంధనలు, కోర్టు ఆదేశాల ప్రకారం డ్రైవర్లకు సీఎంపీఎఫ్ కట్టాల్సి ఉందన్నారు. అయితే మార్చిలో తమకు చెల్లించిన బిల్లులో కంపెనీ 15 శాతం సీఎంపీఎఫ్ కట్ చేసుకొని బిల్లులు ఇచ్చిందని, దీన్ని తాము వ్యతిరేకిస్తున్నారు. పాత బిల్లులు పూర్తిగా చెల్లించాలని, ఈ నెల నుంచి సీఎంపీఎఫ్ కట్ చేసుకోవాలని కోరగా యాజమాన్యం ఒప్పుకోకపోవడంతో సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. అంతే కాకుండా నెలలో 26 రోజుల వర్కింగ్ డేస్‌కే సీఎంపీఎఫ్ రికవరీ చేయాలని కోరారు. వాహనాల సమ్మెతో అధికారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇతర వాహనాలను, అధికారుల పర్సనల్ వాహనాలను, కొన్నిచోట్ల టెండర్ వాహనాలను వినియోగించుకున్నారు. డిమాండ్లపై ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డితో చర్చించగా ఎలాంటి పురోగతి లేకపోవడంతో సమ్మె కొనసాగిస్తామని వారు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మొక్క నాటుతున్న జీఎం బసివిరెడ్డి

జైపూర్: పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అని పవర్ ప్లాంటు జీఎం బసివిరెడ్డి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని పవర్‌ప్లాంటులో పర్యావరణ-నడక కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భావితరాలకు మంచి పర్యావరణాన్ని అందించడానికి అందరూ కృషి చేయాలన్నారు. సింగరేణి సంస్థ ఏటా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో వోఅండ్‌ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎం ప్రసాద్, శ్రీనివాస్‌లు, రమణ, సీఎంవోఏఐ సెక్రెటరీ సంతోశ్‌కుమార్, సీఐఎస్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ శేఖర్, పీఎంపీఎల్ మేనేజర్ అఖిల్‌కపూర్, డీజీఎం వాసుదేవ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'తాళ్లపెల్లి'కి సన్మానం



రాజేశ్వర్‌ను సన్మానిస్తున్న ఆర్టిస్టులు

జన్నారం: ఆర్టిస్టుల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన జన్నారంకు చెందిన తాళ్లపెల్లి రాజేశ్వర్‌ను బుధవారం మండల కేంద్రంలో సన్మానించారు. ఈ సందర్భంగా తెలంగాణ మహార్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ నేత, రాజేశ్వర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వేలాది మంది యువకులు తమ కళలను నమ్ముకుని జీవిస్తున్నారని, వారిని ప్రభుత్వ పరంగా గుర్తింపు తేవడానికి కృషి చేస్తానన్నారు.

8నుంచి ఈసెట్ కౌన్సెలింగ్

బెల్లంపల్లి: టీజీ ఈసెట్-2024 పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈనెల 8 నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీందర్ రెడ్డి తెలిపారు. 8 నుంచి 10 వరకు ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈనెల 18 లోపు విద్యార్థులకు సీట్లు కేటాయిస్తారని వెల్లడించారు. 18 నుంచి 21 వరకు ట్యూషన్‌ఫీజు చెల్లించి సదరు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వాలన్నారు.

పాలిటెక్నిక్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల

బెల్లంపల్లి : టీజీ పాలిసెట్-2024 ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈనెల 20 నుంచి 24 వరకు స్లాట్ బుకింగ్ చేసుకుంటే 22 నుంచి 25 వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంద ని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి తెలిపారు. 22 నుంచి 27వరకు ఆన్‌లైన్‌లో ఆప్షన్స్ ఇస్తే 27న ఫ్రీజింగ్ విధించి 30లోగా సీట్ల కేటాయింపు జరుగుతుందని వెల్లడించారు.

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: వివిధ రంగాల్లో ప్రతిభ కలిగిన బాలబాలికల నుంచి ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాలపురస్కార్ 2025 కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారి కె. చిన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత గల బాలబాలికలు వ్యక్తిగత/ఆయా రంగాల్లో పనిచేసే సంస్థలు తమ దరఖాస్తులను జులై 31లోగా ఆన్‌లైన్‌లో అవార్డు పోర్టల్ https://awards.gov.in లో నమోదు చేసుకోవాలని సూచించారు.